# వరుస సర్వేలతో రైతుల్లో ఆశలు

- చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీళ్లు
- రెండుసార్లు సర్వే చేసిన అధికారులు, మరోసారి సర్వేకు సిద్ధం
- ఆరు గ్రామాల రైతులు, వెయ్యి ఎకరాలకు సాగునీరు



పెంబట్ల శివారులో డీ-53 ఎస్సారెస్పీ కాలువ



లక్ష్మీదేవిపల్లి శివారులో కొనసాగుతున్న అధికారుల సర్వే

**సారంగాపూర్:** మండల కేంద్రం శివారులోని చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీరు వస్తే 40 ఏళ్ల రైతుల కల సాకారం కానుంది.చెరువు నింపితే పంటల సాగు పెరగనుంది. ఈ కాలువ వెంబడి ఉన్న రేచపల్లి, లక్ష్మీదేవిపల్లితో పాటు, సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల రైతులతో పాటు, ధర్మపురి మండలం నేరెల్ల గ్రామం వరకు సాగు నీరు అందనుంది.

**చింతల చెరువులోకి నీరు చేరడం ఆవశ్యకత..**

గతంలో ఏర్పాటు చేసిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి కాలువలు సారంగాపూర్‌లో కొంత భాగం, పోతారం, బట్టపల్లి కాలువ చివరి భూములు కావడంతో ఈ భూములకు ఎస్సారెస్పీ నీరు అందడం లేదు. డీ-53 ప్రధాన కాలువ రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల మీదుగా వెళ్లినా ఈ రెండు గ్రామాల్లోని సారంగాపూర్ ప్రధాన రహదారి వెంట వెళ్లే భూములకు సాగునీరు చేరదు. దీంతో ఆయా గ్రామాల రైతుల పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలంటే చింతల చెరువులోకి నీటిని మళ్లించాలని ఏళ్లుగా రైతుల డిమాండ్ ఉంది.

**రెండు సార్లు అధికారుల సర్వేపూర్తి**

చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని నింపాలని ఇటీవల పలు గ్రామాల రైతులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు రెండు సార్లు సర్వే పూర్తి చేసి, తుది సర్వేకోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పెంబట్ల పెద్దమ్మ ఆలయం వద్ద డీ-53 కాలువ వద్ద ఒక తూము నిర్మించి ఒక కిలోమీటరు అటవీప్రాంతం పక్కన ఉన్న రెవెన్యూ భూముల్లో నుంచి తీసుకురావచ్చని సర్వేలో తేల్చారు. అక్కడి నుండి మరో 4 కిలోమీటర్లు రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి రైతుల పంట పొలాల నుంచి తీసుకవచ్చి, సారంగాపూర్-లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతం పక్కన ఉన్న మామిడి తోట వద్ద రైతులు దాదాపు 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కట్టుకాలువ వరకు నీటిని మళ్లించాలని నిర్ణయించారు. దీంతో నేరుగా చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీరు చేరనుంది. దీని ఖర్చు కోసం అధికారులు ప్రాథమిక అంచనా రూపొందించారు. దీని ద్వారా రైతుల వెయ్యి ఎకరాల వరకు సాగు నీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. వెంటనే చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

### పంటలు కాపాడుకోవచ్చు



చింతల చెరువులోకి ఎస్సారెస్పీ నీటిని నింపితే పంటలు ఎండవు. చాలా ఏళ్లుగా రైతులందరూ దీని కోసం నిరీక్షిస్తున్నాం. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి మంజూరుకు హామీ ఇవ్వడం మాకు చాల లాభం జరుగుతుంది. వర్షాకాలంలో పంటలు పండినా, యాసంగిలో సాగునీరు అందక ఏనాడు పంటలు పూర్తిగా పండలేదు. చింతల చెరువులోకి కాలువ నీరు వస్తే మాకు చాలా లాభదాయకం.

– నలువాల సంపూర్తి, సారంగాపూర్

### ప్రతి పంటకూ ఇబ్బందులే



మా బట్టపల్లి గ్రామానికి ఎస్సారెస్పీ కాలువ ఉన్నప్పటికీ రేచపల్లి గ్రామ శివారులోని 1ఆర్ కాలువ ద్వారా మా పంటలకు నీరు చేరాలి. ప్రతి పంటకు ఒకటి, రెండు తడులు వచ్చిన తరువాత ఎగువన ఉన్న రైతుల పొలాలకు నీరు సరిపోతుంది. మా గ్రామానికి ఏ పంటకు సక్రమంగా నీరు చేరలేదు. చింతల చెరువులో నీళ్లుంటే మా పంటలకు నీరు సులువుగా చేరుతుంది.

– అర్రై ప్రేమానందం, బట్టపల్లి

### సర్వే పనులు ప్రారంభిస్తాం



తుది సర్వే (మూడోసారి) కోసం ఏర్పాటు చేస్తున్నాం. అటవీశాఖకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని తరలించాలన్నదే ప్రధాన ఉదేశ్యం. ఇప్పటికే దీనిపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పలుమార్లు మాతో సమావేశం నిర్వహించారు. దాదాపు గ్రావిటీ ద్వారానే నీరు రైతుల పొలాలకు చేరడానికి సర్వే చేస్తున్నాం. ఇది సక్సెస్ అవుతుంది.

– చక్రూనాయక్,డీఈ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

# రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్

**వెల్గటూర్ :** రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం వేంనూర్ పంప్‌హౌస్‌ను పరిశీలించారు. ఎస్సారెస్పీలో నీటిమట్టం తక్కువగా ఉండడంతో రైతులకు సాగు నీరు అందించే విషయంలో కొంత సమస్య ఏర్పడిందన్నారు. త్వరలోనే నియోజకవర్గంలో తాగు, సాగు నీటికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎల్లంపల్లి, కాళేశ్వరం లింక్-2లో ఈ ప్రాంత వాటా తీసుకున్న తర్వాతే పైకి తరలిస్తామని, తలాపున గోదారి ఉన్నా, తాగేందుకు నీళ్లు లేని పరిస్థితిని పూర్తిగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మద్దుల గోపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, రంగు తిరుపతి, పూదరి రమేశ్, బాలుసాని మల్లేశం, గెల్లు శ్రీనివాస్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**జగిత్యాల:** వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా వెలమ సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక వెలమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వెలమ సామాజికవర్గంలో అత్యధికంగా వెనుకబడిన పేద, నిరుపేదల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# కుస్తాపూర్‌లో నంది విగ్రహ ప్రతిష్ఠాపన



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

**మల్లాపూర్:** మండలంలోని కుస్తాపూర్ శివారులో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నంది విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్యఆలయ అర్చకులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, ఎంపీటీసీ దేవ ముత్తమ్మ, ద్యాగ గంగారెడ్డి, నాయకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీగా సభకు వెళ్తున్న బీజేపీ నాయకులు

**కోరుట్ల:** జగిత్యాలలో ప్రదాని నరేంద్ర మోదీ బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు కోరుట్ల నుంచి జగిత్యాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ, నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వేంకటేశ్వర, అలివేలు, పద్మావతి ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**సారంగాపూర్:** దుబ్బరాజన్న అనుబంధ శ్రీవేంకటేశ్వర అలివేలు, పద్మావతి అమ్మవార్ల ఆలయంలో సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు, నేడు స్వామివారి, అమ్మవార్ల కల్యాణం జరగనుంది. కార్యక్రమంలో ఈవో అనూష, ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ శంకరయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

**శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం**



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

**మల్లాపూర్:** మండలంలోని రాఘవపేటలో సోమవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు దేవస్థాన అధ్యక్షులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో 20న స్వామి కల్యాణం, అన్నదానం, జాతర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్ పాల్గొన్నారు.

## గోడలపై పార్టీల వాల్‌పోస్టర్లు ఉంచొద్దు

**కథలాపూర్:** గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న గోడలకు, విద్యుత్ స్తంభాలకు రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లు ఉండకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం పోతారం, తాండ్ర్యాల గ్రామాల్లో పర్యటించారు. అక్కడక్కడ రాజకీయపార్టీల వాల్‌పోస్టర్లు కనిపించడంతో వాటిని సిబ్బందితో తీయించాలని కార్యదర్శులకు సూచించారు.

## వైభవంగా రాజరాజేశ్వర కల్యాణం



స్వామివారి కల్యాణంలో భక్తులు, అర్చకులు

**కోరుట్ల రూరల్:** మండలంలోని మాదాపూర్ శివాలయంలో రాజరాజేశ్వర స్వామి కల్యాణవేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య, ఎంపీటీసీ కృష్ణా రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పోషక పదార్థాలతో ఎంతో ప్రయోజనం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

**పెగడపల్లి:** పోషక పదార్థాలతో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర అన్నారు. మండలంలోని పలు అంగన్‌వాడీకేంద్రాల్లో సోమవారం పోషణ వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ లబ్ధిదారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

**గ్రామాల్లో పోషణ పక్షోత్సవాలు**

**మేడిపల్లి:** పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మేడిపల్లి, భీమారం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో ఖేలో ఔర్ పడో నిర్వహించారు. దీనిలో భాగంగా పిల్లలకు ఆటపాటలతో విద్యను అందిస్తునామని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సీడీపీవో వీరలక్ష్మి, సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు పాల్గొన్నారు.

**గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి**

**ఇబ్రహీంపట్నం:** అధిక పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రతిభ తెలిపారు. సోమవారం మండలంలోని గోధూర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్షోత్సవాలను పురస్కరించుకుని పోషణ్ బీ, పడాలి బీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిల్లెట్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

**జగిత్యాలరూరల్:** చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి అంగన్‌వాడీ-2 కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. పాఠశాల్లో కిశోర బాలికలకు రక్తహీనత నివారణ, పోషకాహారం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఏవీఎస్.రాజు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం శ్రీనివాస మూర్తి, అంగన్‌వాడీ టీచర్లు జమున పాల్గొన్నారు.

# ఎంపీవోపై దాడి సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు

**జగిత్యాలరూరల్:** ఎంపీవోలపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల రూరల్, అర్బన్ ఎంపీడీవోలు రమాదేవి, విజయలక్ష్మి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవోపై జరిగిన దాడికి నిరసనగా కార్యాలయ ఉద్యోగులు జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీవోపై ఎంపీపీ దాడి చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారుల సంఘం అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, అర్బన్ ఎంపీవో సలీం, సూపరింటెండెంట్లు గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన**

**రాయికల్:** నాగర్ కర్నూల్ జిల్లా కొడేరు మండలంలో ఎంపీవోపై జరిగిన దాడిని నిరసనగా సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మండల పరిషత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.చిరంజీవి, ఎంపీవో కె సుష్మ , పర్యవేక్షకులు వేణు మాధవ్, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలతో పేదల అభ్యున్నతికి కృషి



కాంగ్రెస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు

**మల్లాపూర్:** ప్రజాప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాడని కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి, ఎంపీటీసీలు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మరిపెల్ల సత్తెమ్మమల్లయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ప్రధానమంత్రిని కలిసిన ధర్మపురి వాసులు**

**ధర్మపురి:** విజయ సంకల్పయాత్రలో భాగంగా జగిత్యాలలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రధానమంత్రి నరేంద్రమోదీని ధర్మపురి బీజేపీ మండల, పట్టణశాఖ అధ్యక్షులు సంగెపు గంగారం, బెజ్జారపు లవన్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

**వందనం.. ప్రతివందనం**

**జగిత్యాల:** విజయ సంకల్ప సభలో ప్రధానిమోదీ రాగానే స్టేజీ పైనున్న మహిళలందరూ ప్రధానికి నమస్కరించారు. అందులో ఒక మహిళ మోదీ కాళ్లు మొక్కగా వెంటనే మోదీ తిరిగి ఆ మహిళకు పాదాభివందనం చేయడంతో సభా ప్రాంగణమంతా హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి.

**మోదీకి అభివాదం**

**సారంగాపూర్:** ప్రధాని నరేంద్రమోదీ సోమవారం జగిత్యాలకు వచ్చిన సందర్భంగా బీజేపీ సారంగాపూర్ మండల అధ్యక్షుడు ఎండబెట్ల వరుణ్‌కుమార్ ప్రధాని మోదీని కలిసి అభివాదం చేయగా, తిరిగి మోదీ కూడా అభివాదం చేశారు.

**విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి**

**మెట్‌పల్లి:** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి కృషి చేయాలని రిటైర్డ్ ఎంఈవో చెరుకు సుధాకర్ సూచించారు. విజయసాయి సెంట్రల్ హైస్కూల్‌లో సోమవారం సైన్స్‌ఫెర్‌కు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు మోడల్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ పుల్లా ప్రదీప్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఓటు హక్కుపై అవగాహన**

**కోరుట్ల:** పట్టణంలోని కేరళ హైస్కూల్లో సోమవారం ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఓటు హక్కు వినియోగం, ప్రాధాన్యతల పై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్,ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఏ బారీ, ప్రిన్సిపాల్ వర్గీస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాజన్న ఆలయ నూతన కమిటీ ఎన్నిక**

**పెగడపల్లి:** మండల కేంద్రంలోని శ్రీస్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా వారుగల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కమిటీ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి రామచంద్రం, ఉపాధ్యక్షులుగా గరువందల రాజశేఖర్‌గౌడ్, కట్ల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మాదారపు కిషన్‌రావు, ప్రచార కార్యదర్శులుగా మాసూరి పార్థసారథి, జక్కుల మల్లేశం, కోశాధికారిగా బోగ గోపికృష్ణ నియామకమయ్యారు.

**యాదవ సంఘం నూతన కార్యవర్గం..**

**మల్యాల:** యాదవ సంఘం మల్యాల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగ నారాయణ, ఉపాధ్యక్షుడిగా గడ్డి లచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా నక్క మల్లయ్య, కోశాధికారిగా సంగ శ్రీనివాస్‌తోపాటు కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

**పద్మశాలీ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక**

**మెట్‌పల్లి:** పట్టణంలోని 18 వార్డు పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ధర్మపురి నందకుమార్, ఉపాధ్యక్షుడిగా గోలి సుధాకర్, కార్యదర్శిగా సాంబారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా గుంటుక అనిల్, కోశాధికారిగా గుంటుక శ్యామ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**అజోల్ల, మాగుడు గడ్డి పెంపకంపై నేడు శిక్షణ**

**కోరుట్ల రూరల్:** పట్టణ శివారులోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయంలో పశుగణ క్షేత్ర సముదాయం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అజోల్ల, మాగుడు గడ్డి పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశుగణ క్షేత్ర సముదాయ హెడ్ డాక్టర్ బి. శ్రీదేవి సోమవారం తెలిపారు. ఆసక్తి గల రైతులు అసోసియోట్ ప్రొఫెసర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

**నేడు రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్**

**ఇబ్రహీంపట్నం:** మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పంటలపై అవగాహన కల్పించనున్నట్లు ఏవో దీపిక సోమవారం తెలిపారు. వరిపంట, ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కూరగాయల పంటలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

## క్లుప్తంగా

### బస్టాండ్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం



బస్టాండ్‌ను శుభ్రం చేస్తున్న వలంటీర్లు

**కొండగట్టు:** కరీంనగర్ వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కొడిమ్యాల బస్‌స్టేషన్ పరిసరాల్లో పిచ్చి మొక్కలను చెత్త చెదారాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ జిల్లా మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి డా. కె.మురళి, జిల్లా రైతు సంఘం మాజీ అధ్యక్షుడు వి.రాంరెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారులు డా.గోపీకృష్ణ, కె.సతీశ్, కొడిమ్యాల మాజీ ఉప సర్పంచ్ గడ్డం జీవన్‌రెడ్డి, ఆదిరెడ్డి, సీనియర్ వలంటీర్లు రవిచందర్, ఆదిత్య, వలంటీర్లు పాల్గొన్నారు.

### నిధులు మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

**కోరుట్ల:** పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.70 లక్షల నిధులు మంజూరు కావటంతో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కల్యాణ మండపం వద్ద మాట్లాడుతూ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో కల్యాణ మండపం నిర్మాణం కాగా ఇప్పటి వరకూ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్ట లేదన్నారు. నిధులు మంజూరు చేయించిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, సీనియర్ నాయకుడు కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 9వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి పోగుల భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

### కరాటే శిక్షణ విద్యార్థులకు బెల్టులు ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

**జగిత్యాలజోన్:** జిల్లా కేంద్రంలోని మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థులు కరాటేలో శిక్షణ పొందగా, సోమవారం వారికి బెల్టులతో పాటు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతిష్ మరియా మాట్లాడుతూ విద్యతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే లాంటి క్రీడల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ చైర్మన్ కె. వసంతకుమార్, జిల్లా అధ్యక్షుడు మద్రిపెల్లి శ్రీనివాస్, ఒకినావా మార్షల్ అకాడమీ శిక్షకుడు నరేశ్, సీనియర్ కరాటే మాస్టర్ లింగయ్య, పీఈటీ హరీశ్ పాల్గొన్నారు.

### ఐసీటీసీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

**కోరుట్ల:** పట్టణంలోని అల్లమయ్య గుట్ట అర్బన్ హెల్త్ సెంటర్‌లో సంపూర్ణ సురక్షా కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. 52 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.గర్భిణులు, టీబీ వ్యాధిగ్రస్తులకు హెచ్ఐవీ, సుఖ వ్యాదుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్, ఎస్ఎస్‌కే మేనేజర్ సంతోష్, ల్యాబ్ టెక్నిషియన్లు సాజిద్ అలీ,శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**సింగరావుపేటలో గాలికుంటు నివారణ టీకాలు**

**రాయికల్:** మండలంలోని సింగరావుపేటలో సోమవారం పశువైద్యాధికారి నరేశ్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి రాకుండా ఉండేందుకు ఈ టీకాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రైతులు కృష్ణారెడ్డి, రాజేశ్,బద్దం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.